

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

A.C.O - 9003200801

S.R - 9551168092

27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017



తిరుచెందూరు ఆలయం

2న తిరుచెందూరులో స్కంధషష్ఠి వేడుకలు

● 7న శూరసంహారం

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యస్వామివారి ఆరు దివ్యక్షేత్రాల్లో రెండవదైన తిరుచెందూరు ఆలయంలో నవంబర్ 2 నుంచి స్కంధషష్ఠి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. నవంబరు 13 వరకు 12 రోజులపాటు జరిగే ఈ వేడుకలకు దేశవిదేశాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఈ వేడుకలలో అత్యంత ప్రధానఘట్టంగా అక్కడి సముద్రతీరంలో నిర్వహించే శూరసంహారవైభవంలో లక్షలాదిమంది భక్తులు పాల్గొననున్నారు. ఇంతటి ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ స్కంధషష్ఠి వేడుకలు నవంబర్ 2 ఉదయం యాగ పూజతో ప్రారంభమవుతాయి. ఆ రోజు రాత్రి 1.30 గంటలకు విశ్వరూప దర్శనం, రెండు గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, ఉదయం 5.30 గంటలకు జయంతి నాథర్ స్వామివారు యాగశాలకు బయలుదేరి వెళతారు. ఉదయం 7 గంటలకు యాగశాలపూజలు ప్రారంభమవుతాయి. ఉదయం 9 గంటలకు ఉచ్చికాల అభిషేకం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.45 గంటలకు శూలాయుధ శిక్షణ, వీరఖడ్గ శిక్షణకు సంబంధించిన గానాలతో స్వర్ణసప్పరంలో జయంతి నాథర్ స్వామివారు షణ్ముగవిలాస మండపానికి వేంచేయనున్నారు. అక్కడ స్వామివారికి దీపారాధన జరుగుతుంది. మధ్యాహ్నం 3.30 గంటలకు సంధ్య దీపం, 4 గంటలకు తిరువాడుదురై ఆధీనం షష్ఠి మండపంలో స్వామివారికి అభిషేకం, దీపారాధన నిర్వహిస్తారు. ఆ తర్వాత జయంతి నాథర్‌స్వామి గిరి వీధుల్లో ఊరేగి ఆలయానికి వేంచేయనున్నారు. నవంబర్ 3 నుంచి 6 వరకు ప్రతిరోజూ వేకువజాము మూడు గంటలకు ఆలయాన్ని తెరచి విశ్వరూపదర్శనం దీపారాధన యథావిధిగా చేస్తారు. నవంబర్ 7న శూరసంహారవేడుకలు జరగనున్నాయి. ఆ రోజు సాయంత్రం 4.30 గంటలకు జయంతినాథర్‌స్వామివారు శూరపద్మిడి సంహారానికి సముద్రతీరానికి చేరుకుంటారు. లక్షలాదిమంది భక్తుల నడుమ శూరసంహార ఘట్టం ముగిసిన తర్వాత సంతోషమండపంలో అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారు ప్రధాన ఆలయానికి చేరుకుంటారు. ఆ రోజు అష్టోత్తర మహాదేవర్ సన్నిధిలో ఛాయాభిషేకం నిర్వహించి షష్ఠి కవచధారణ జరుగుతుంది. నవంబర్ 8 రాత్రి ఆలయానికి చేరువగా ఉన్న తిరుకల్యాణమండపంలో స్వామివారు దైవానై (దేవసేన)ను పరిణయమాడనున్నారు. నవంబర్ 9 నుంచి 11 వరకు స్వామివారు వివిధ వాహనాల్లో ఊరేగనున్నారు. ఈ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఆలయ తక్కర్ (ట్రస్టీ) అరుల్‌మురుగన్, ఆలయ డిప్యూటీ కమిషనర్ జ్ఞానశేఖరన్ తగు ఏర్పాట్లు చేపడుతున్నారు.

తమిళతల్లి ప్రార్థనలో మళ్లీ తప్పులు

● ఉపముఖ్యమంత్రి ఉదయనిధి సమక్షంలోనే అధికారుల నిర్వాకం

● రాజీనామాకు డిమాండ్ చేసిన కేంద్ర మంత్రి మురుగన్

● నిర్వాహకులు బే షరతుగా క్షమాపణ చెప్పాలి: అన్బుమణి



పీజీ సర్టిఫికెట్లు అందుకున్న యువనిపుణులతో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, అధికారులు

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటైన ఓ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి సమక్షంలో తమిళ తల్లి ప్రార్థనాగీతంలో తప్పులు దొర్లాయి. ఇటీవల మద్రాస్ దూరదర్శన్ ఆధ్వర్యంలో గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొన్న హిందీ మాసోత్సవంలో తమిళతల్లి ప్రార్థనగీతంలో ద్రావిడనాడు కీర్తిని తెలిపే ఓ వాక్యం పాడకపోవడం తీవ్ర విమర్శలకు గురైన విషయం తెలిసిందే. తమిళ తల్లి ప్రార్థనలో తప్పిదం జరిగినా గవర్నర్ పట్టించుకోకపోవటంపై ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్రస్థాయిలో విమర్శలు కూడా చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా సచివాలయంలో శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి ఫెలోషిప్ ప్రోగ్రామ్ కింద పబ్లిక్ పాలసీ అండ్ మేనేజ్‌మెంట్‌లో రెండేళ్ల కోర్సు పూర్తి చేసుకున్న యువ నిపుణులకు పీజీ సర్టిఫికెట్ల ప్రదానోత్సవం జరిగింది. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఉద్యోగినులు తమిళ తల్లి ప్రార్థన ఆలాపిస్తూ ఓ వాక్యంలో ఉన్న 'కండమిదిల్' అనే పదాన్ని 'కండమదిల్' అంటూ తప్పుగా ఉచ్చరించారు. దీనికి తోడు మైకు సరిగా పనిచేయకపోవడంతో 'ద్రావిడనల్ తిరునాడు' అనే పదం సరిగా వినిపించలేదు. ఈ తప్పిదాలను గమనించి ఉదయనిధి ప్రార్థన పూర్తయ్యాక, ఆ మహిళలను తప్పులు లేకుండా మళ్లీ తమిళ తల్లి ప్రార్థన పాడమన్నారు. ఆ మేరకు అధికారులు ఆ మహిళా ఉద్యోగుల చేత రెండోసారి తమిళ తల్లి ప్రార్థనా గీతాన్ని పాడించారు. ఆ సమయంలోనూ ఓ వాక్యంలో ఉన్న 'పుగళ్ మనక్క' అనే పదాన్ని 'తిగళ్ మనక్క' అని తప్పుగా ఉచ్చరించారు. దీంతో ఉదయనిధి అధికారులను కాసేపు గుర్రుగా చూసి మిన్నకుండి పోయారు. ఈ కార్యక్రమం అనంతరం ఉదయనిధి మీడియాతో మాట్లాడుతూ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో తమిళ తల్లి ప్రార్థన తప్పుగా పాడలేదని, మైకులు సరిగా పనిచేయలేదని, సాంకేతిక లోపం ఏర్పడిందని, రెండు మూడు చోట్ల మైకు సరిగా పనిచేయక వినిపించలేదని వివరణ ఇచ్చారు. రెండోసారి పాడించినా మైకు సరిగా పనిచేయలేదని, కనుక ప్రార్థన తప్పుగా పాడలేదని, సాంకేతిక లోపం వల్ల కొన్ని పదాలు వేరే విధంగా వినిపించిందంటూ సర్దిపుచ్చారు. తమిళ తల్లి ప్రార్థన సక్రమంగానే పాడారని, ఈ విషయాన్ని సమస్యాత్మకం చేయవద్దని పాత్రికేయులకు హితవు పలికారు.

రాజీనామా చేయాలి...

ఇదిలా ఉండగా సచివాలయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమిళ తల్లి ప్రార్థనను రెండుసార్లు తప్పుగా పాడినా మౌనం పాటించిన ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తన పదవికి రాజీనామా చేయాలని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన జారీ చేశారు. దూరదర్శన్ జరిపిన హిందీ మాసోత్సవంలో తమిళ తల్లి ప్రార్థన తప్పుగా పాడారంటూ రాద్ధాంతం చేసిన ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రభుత్వ కార్యక్రమంలోనే అలాంటి తప్పు జరిగినా కిమ్మనకుండా ఉండటం గర్హనీయమన్నారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

క్షమాపణలు చెప్పాలి...

సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పాల్గొన్న కార్యక్రమంలో తమిళ తల్లి ప్రార్థనలో తప్పులు దొర్లినందుకు ఆ కార్యక్రమ నిర్వాహకులు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ డిమాండ్ చేశారు. దూరదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన హిందీ మాసోత్సవంలో తమిళతల్లి ప్రార్థనను తప్పుగా పాడినందుకు ఆ సంస్థ ఉన్నతాధికారులు క్షమాపణ తెలిపారని, అదేవిధంగా సచివాలయం అధికారులు కూడా క్షమాపణలు చెప్పాల్సిందేనని ఆయన కోరారు.

రికార్డులు వేసుకుంటే సరి...

తమిళతల్లి ప్రార్థన విద్యార్థులు, మహిళలు, ఉద్యోగినుల చేత పాడించడం కంటే రికార్డులను వేసుకుంటే సరిపోతుందని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలతా పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పాల్గొన్న ప్రభుత్వ కార్యక్రమంలో తమిళ తల్లి ప్రార్థనలో తప్పులు జరగడం గర్హనీయమన్నారు. ఈ సంఘటనను సాంకేతిక సమస్య అంటూ ఉదయనిధి కొట్టిపారేయడం సబబు కాదన్నారు.

స్టాలిన్ మౌనం సబబేనా?

దూరదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన హిందీ మాసోత్సవంలో తమిళ తల్లి ప్రార్థనలో తప్పు దొర్లినందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సచివాలయంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ ప్రార్థనలో తప్పులు దొర్లితే మౌనం పాటించడం గర్హనీయమని అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్ విమర్శించారు. తమిళతల్లికి కళంకం జరిగిందంటూ గవర్నర్‌పై ధ్వజమెత్తిన స్టాలిన్, ప్రస్తుతం ఉపముఖ్యమంత్రిపై ఎలాంటిచర్యలు చేపడతారంటూ ప్రశ్నించారు.

2026లో అధికారం మాదే!

● ఈపీఎస్ ధీమా



ఎంజీఆర్, జయలలిత చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేకు రోజురోజుకూ ప్రజాభిమానం పెరుగుతోందని 2026లో జరిగే శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధీమా వ్యక్తంచేశారు. సేలం జిల్లా ఎడప్పాడిలో శుక్రవారం ఉదయం జరిగిన పార్టీ నిర్వాహకుల సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రసంగించారు. ఎడప్పాడి నియోజకవర్గం అన్నాడీఎంకేకు ఎల్లప్పుడూ కంచుకోటని, ఈ నియోజకవర్గంలో గెలిచేందుకు అధికార పార్టీ చేసిన ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టారన్నారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికలకంటే 2024లో జరిగి లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకేకి ఒక శాతం ఓట్లు పెరిగాయని, ఈ విషయాన్ని తాను చెబితే ఎడప్పాడి తప్పుడు లెక్కలు చెబుతున్నారని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ విమర్శించటం గర్హనీయమన్నారు. లోక్‌సభ ఎన్నికలు, శాసనసభ ఎన్నికల వరకూ మౌనం పాటించిన డీఎంకే మిత్రపక్షాలు ప్రస్తుతం తిరుగుబాటు ధోరణిలో వ్యవహరిస్తున్నాయని, అధికారంలో భాగస్వామ్యం కావాలంటూ ఒత్తిడి చేస్తున్నాయని, 2026 అసెంబ్లీ ఎన్నికల్లోగా కొన్ని మిత్రపక్షాలు ఆ కూటమి నుండి బయటపడే అవకాశం కూడా ఉందని ఈపీఎస్ జోస్యం చెప్పారు. కూటమికి నాయకత్వం వహిస్తున్న డీఎంకేపై మిత్రపక్షాలు ధ్వజమెత్తుతున్నా, కూటమిలో మనస్పర్థలు లేవని, వివాదాలు మాత్రమేనంటూ స్టాలిన్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సుపరిపాలనకు బదులు అవినీతి పాలనను అందించిన డీఎంకేకు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల పరిశీలన

కోవై జిల్లాతో మొదలు ● 5 నుంచి సీఎం సమీక్షలు



ప్యారీస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి పథకాలు ప్రజలకు ఏ మేరకు చేరుతున్నాయన్న దానిపై ముఖ్యమంత్రి స్టాలిన్ క్షేత్రస్థాయి పరిశీలనకు సిద్ధమయ్యారు. జిల్లాల వారీగా పరిశీలన చేయనున్న సీఎం.. కోవై జిల్లా నుంచే మొదలుపెట్టనున్నారు. ఆ మేరకు ఆయన నవంబరు 5, 6 తేదీల్లో కోవైలో సమీక్షించనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. దివంగత మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, కరుణానిధి కృషి వల్ల డీఎంకే పార్టీ దేశ రాజకీయాల్లో చక్రం తిప్పే విధంగా అభివృద్ధి చెందిందని సీఎం ఆ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉంచాలన్న దృక్పథంతో తాను ముఖ్యమంత్రి హోదాలో భారీస్థాయిలో పెట్టుబడులు ఆకర్షించేలా చేపట్టిన అమెరికా పర్యటన సంతృప్తినిచ్చిందని, ద్రావిడ మోడల్ ప్రభుత్వ పథకాలు, సిద్ధాంతాలు ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో తాను అన్ని జిల్లాల్లో పరిశీలన చేపట్టేలా ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు లేఖ రాసి కార్యక్రమాలకు సంబంధించి నివేదిక తయారుచేయాలని సూచించినట్టు సీఎం తెలిపారు. తొలివిడతగా కోవై జిల్లాలో తాను చేపట్టనున్న పర్యటన విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే పని చేయాలని కోరారు. రాష్ట్ర ప్రజల కోరికలు పరిష్కరింపజేసేలా దీపావళి పండుగ అనంతరం ఈ క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందని, అనంతరం మిగతా జిల్లాల్లో కూడా ఈ తరహా పర్యటన చేపట్టనున్నట్లు సీఎం స్టాలిన్ తెలిపారు.

బోగీల నుంచి విడిపోయిన రైలింజన్




నిలిచిపోయిన పెట్టెలు - ఊడిపడిన రైలింజన్, బోగీలను అనుసంధానం చేస్తే కప్లింగ్ పరికరం

వేలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలో ఎక్స్‌ప్రెస్ రైలింజన్ బోగీల నుంచి విడిపోవడంతో కలకలం రేగింది. అస్సోం రాష్ట్రం డిబ్రూఘర్ నుంచి కన్నియకుమారి వెళ్లే ఎక్స్‌ప్రెస్ శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో కాట్పాడి సమీపంలో వెళ్తుండగా, ముకుందరాయపురం-తిరువలం మధ్య రైలింజన్ బోగీలను అనుసంధానం చేసే కప్లింగ్ ఊడింది. దీంతో, బోగీలు రైలుపట్టాలపై నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న అధికారులు, ముందు వెళ్లిన రైలింజన్‌ను మళ్లీ వెనుకకు రప్పించి బోగీలను అనుసంధానం చేసి పంపించారు. ఈ ఘటన కారణంగా సుమారు రెండు గంటలు ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

స్పీకర్ అప్పావుకు ఊరట

● కేసు రద్దు చేసిన హైకోర్టు



పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాటి ముఖ్యమంత్రి జయలలిత మరణానంతరం 40 మంది ఎమ్మెల్యేలు డీఎంకేలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారంటూ వ్యాఖ్యానించిన ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ అప్పావుపై ప్రత్యేక కోర్టులో దాఖలైన పరువు నష్టం కేసును మద్రాసు హైకోర్టు రద్దు చేసింది. నగరంలో గత ఏడాది జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడిన స్పీకర్ అప్పావు.. జయ మరణించిన తర్వాత 40 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు డీఎంకేలో చేరేందుకు సిద్ధమయ్యారని వ్యాఖ్యానించారు. అయితే అసెంబ్లీ స్పీకర్ వ్యాఖ్యలు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలకు కళంకం తెచ్చేలా ఉన్నాయంటూ అన్నాడీఎంకే న్యాయవాదుల విభాగం సంయుక్త కార్యదర్శి ఆర్ఎం బాబు మురుగవేల్ పిటిషన్ వేశారు. ఈ కేసు నగరంలోని ఎంపీ, ఎమ్మెల్యేపై ఉన్న కేసులు విచారిస్తున్న ప్రత్యేక న్యాయస్థానంలో విచారణలో ఉంది. ఈ నేపథ్యంలో, ఈ కేసు రద్దు చేయాలని, విచారణకు స్టే విధించాలని కోరుతూ స్పీకర్ అప్పావు మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణ న్యాయమూర్తి జి.జయచంద్రన్ చేపట్టగా, ఇరుతరపు వాదనలు పూర్తయిన తర్వాత తీర్పును వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో, స్పీకర్ అప్పావుపై ప్రత్యేక కోర్టులో వేసిన పరువు నష్టం కేసును మద్రాసు హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఫిర్యాదుదారుడు వ్యక్తిగతంగా ఈ కేసు వేశారని, కేసు దాఖలుకు ఆయనకు పార్టీ ఎలాంటి అధికారం ఇవ్వలేదని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అన్నాడీఎంకే ఎంపీ షణ్ముగం అరెస్టు

● ఎస్పీ కార్యాలయం ముందు ధర్నాతో ఉద్రిక్తత



ఎస్పీ కార్యాలయం ముందు భైఠాయించిన ఎంపీ షణ్ముగం

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో తనపై వస్తున్న తప్పుడు వార్తలపై ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసుల తీరును ఖండిస్తూ ధర్నాకు దిగిన అన్నాడీఎంకే సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం అరెస్టయ్యారు. దీంతో విల్లుపురం ఎస్పీ కార్యాలయం వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. వివరాలిలా వున్నాయి... గతంలో తాను ఇచ్చిన ఫిర్యాదులపై ఏ మేరకు చర్యలు తీసుకున్నారో తెలుసుకునేందుకు శుక్రవారం ఉదయం సీవీ షణ్ముగం విల్లుపురం జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. అయితే ఆ సమయంలో ఎస్పీ లేకపోవడంతో మధ్యాహ్నం 12 గంటల వరకు వేచి చూశారు. అయినా ఎస్పీ అందుబాటులోకి రాకపోవడంతో ఆగ్రహించిన షణ్ముగం. కార్యాలయం బయట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కళ్లకుర్చి జిల్లాలో వీసీకే నిర్వహించిన మద్యం, మాదకద్రవ్యాల నిర్మూలన మహానాడులో అన్నాడీఎంకే తరపున తాను హాజరవుతున్నట్లు అన్నాడీఎంకే అధికార టీవీ 'న్యూస్ జే' ఛానల్‌లో వార్త వచ్చిందంటూ సోషల్ మీడియాలో కథనాలు వెలువడ్డాయని తెలిపారు. ఇలాంటి తప్పుడు కథనాలు రావడం ఇదే తొలిసారి కాదని, గత పార్లమెంటు ఎన్నికల్లో, విక్రవాండి ఉప ఎన్నికల సమయాల్లోను ఇలాగే తన గురించి అసత్య వార్తలు పోస్టు చేశారని తెలిపారు. డీఎంకే అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 23 ఫిర్యాదులు చేయగా, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. అపాయింట్‌మెంట్ తీసుకున్నాకే ఎస్పీ కార్యాలయానికి వచ్చినా, ఎస్పీ ఉద్దేశపూర్వకంగా తనకు అందుబాటులోకి రాకుండా వెళ్లిపోయారని తెలిపారు. మాజీ మంత్రిని, రాజ్యసభ సభ్యుడినైన తన ఫిర్యాదుపైనే పోలీసులు చర్యలు తీసుకోలేదంటే, ఇక సామాన్యుల పరిస్థితి ఎలా వుంటుందని ప్రశ్నించారు. కాగా సీవీ షణ్ముగం ధర్నాతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. దీంతో విల్లుపురం తాలూకా ఇన్‌స్పెక్టర్ సెల్వవినాయగం, జిల్లా క్రైం డీఎస్పీ రామలింగం అక్కడకు వచ్చి సీవీ షణ్ముగంను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. అయినా ఆయన పట్టించుకోకపోవడంతో మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పోలీసులు ఆయన్ని అరెస్టు చేశారు.

సమాచార దర్శిని

అన్నా పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ధైర్యసాహసాలు ప్రదర్శించిన వారు అన్నా పురస్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... గణతంత్ర దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ద్వారా ఈ పురస్కారగ్రహీతలకు రూ.లక్ష చెక్, పతకం, ప్రశంసాపత్రం అందజేస్తారు. ఆసక్తి కలిగిన వారు https://awards.tn.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా డిసెంబరు 15వ తేది లోపు దరఖాస్తు సమర్పించాలని ప్రభుత్వం తెలియజేసింది.

1న కోయంబేడు మార్కెట్‌కు సెలవు

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్‌కు దీపావళి మరుసటిరోజు నవంబరు 1వ తేది సెలవు ప్రకటించింది. కోయంబేడు మార్కెట్లో వ్యాపారులు, కార్మికులు స్వగ్రామాల్లో జరుపుకొనేలా నవంబరు 1వ తేది మార్కెట్‌కు సెలవు ప్రకటిస్తున్నట్లు కోయంబేడు పూల మార్కెట్ వ్యాపారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు జీడీ రాజశేఖరన్ తెలిపారు.

7న మాజీ సైనికుల గ్రీవెన్స్

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల గ్రీవెన్స్ నవంబరు 7వ తేది జరుగనుంది. ఈ మేరకు తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ విడుదల చేసిన ప్రకటనలో... కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 11గంటలకు జరిగే ఈశిబిరంలో జిల్లాలోని మాజీ సైనికులు, కుటుంబ సభ్యులు పింఛన్ ఇతర సమస్యలపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నంగనల్లూర్ మెట్రో పేరు మార్పు

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీఎస్‌టీ రోడ్డులో 'నంగనల్లూర్ రోడ్డు మెట్రో రైల్వేస్టేషన్' సమీపంలో ఓటీఏ అని పిలిచే సైనిక అధికారుల శిక్షణా కేంద్రం ఉంది. అందువల్ల 'నంగనల్లూర్ రోడ్డు మెట్రో రైల్వేస్టేషన్' పేరును 'ఓటీఏ నంగనల్లూర్ రోడ్డు మెట్రో రైల్వేస్టేషన్'గా పేరు మార్చాలని సైనిక ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వం, సీఎంఆర్ఎల్ కు విజ్ఞప్తి చేశారు. ఆ విజ్ఞప్తిని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం నంగనల్లూర్ రోడ్డు మెట్రో రైల్వేస్టేషన్ పేరును ఓటీఏ నంగనల్లూర్ రోడ్డు మెట్రో రైల్వేస్టేషన్‌గా పేరు మార్చుతూ జీవో విడుదల చేసింది.

పెరంబూర్ మార్గంగా బీహార్‌కు రైలు

పెరంబూర్,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): కోవై నుంచి శుక్రవారం, నవంబరు 2,9,16 తేదీల్లో బయల్దేరే ప్రత్యేకరైలు, చెన్నై పెరంబూర్ మార్గంగా మూడవ రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బీహార్ రాష్ట్రం బరూనికి చేరుకుంటుంది. మరుమార్గంలో, ఈ నెల 29, నవంబరు 5,12,19 తేదీల్లో రాత్రి 11.45 గంటలకు బయల్దేరే రైలు పెరంబూరుమార్గంగా నాలుగో రోజు వేకువజామున 3.45 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది. ఈ రైళ్ల రిజర్వేషన్ ప్రారంభమైందని అధికారులు తెలిపారు.

కామాక్షి అమ్మవారి హుండీ ఆదాయం రూ.59 లక్షలు

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కంచి కామాక్షి అమ్మవారి హుండీ ఆదాయం రూ.59లక్షలు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ ఆలయ హుండీల లెక్కింపు గురువారం ఆలయ కార్య నిర్వహణాధికారి శ్రీనివాసన్ నేతృత్వంలో జరిగింది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు హుండీలో వేసిన కానుకలు లెక్కించగా రూ.59,16,361 నగదు, 163 గ్రాముల బంగారం, 432 గ్రాముల వెండి వచ్చిందని తెలిపారు.

ఎంటీసీకి 500 ఎలక్ట్రికల్ బస్సులు

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ (ఎంటీసీ)కి 500 ఎలక్ట్రికల్ బస్సులు విక్రయించే ఒప్పందాన్ని, హిందూజా సంస్థకు చెందిన అశోక్ లైలాండ్ దక్కించుకుంది. ఈ మేరకు ఎంటీసీ విడుదల చేసిన ప్రకటనలో... ఒప్పందం ప్రకారం, విద్యుత్‌తో నడిచే స్విచ్ ఈఐవీ 12 రకానికి చెందిన బస్సులు పొందనున్నామన్నారు ఒకసారి ఛార్జ్ చేస్తే 200 కి.మీ వరకు వెళ్లే ఈ బస్సుల్లో 37 మంది కూర్చొనేలా, మరో 24 మంది నిల్చొని ప్రయాణించవచ్చని ఎంటీసీ తెలియజేసింది.

కమిషనర్ కార్యాలయంలో గ్రీవెన్స్



సమస్యలు తెలుసుకున్న పోలీస్ కమిషనర్ అరుణ్

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం పోలీసు గ్రీవెన్స్ జరిగింది. అధికారులు, పోలీసుల సమస్యలు తెలుసుకొనేలా ప్రతి నెలా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అరుణ్ పాల్గొని, బదిలీ, క్వార్టర్స్ కేటాయింపు, వేతనం సహా పలు సమస్యలపై 199 వినతులు స్వీకరించి, సమస్యలపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ కపిల్‌కుమార్ (ప్రధాన కార్యాలయం), కేఎస్ నరేంద్రన్ నాయర్ (నార్త్), డిప్యూటీ కమిషనర్ పి.విజయకుమార్ (వెస్ట్), ఎ.కయల్‌విళి (ప్రధాన కార్యాలయం), సహాయ కమిషనర్ ఎస్.మేకలీనా, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కొండలపై ట్రెక్కింగ్‌కు అనుమతి

పేర్ల నమోదుకు కొత్త వెబ్‌సైట్



ఎక్కడెక్కడకు వెళ్లొచ్చు....?

జిల్లా	మార్గం	ప్రయాణ దూరం (కి.మీ)	రుసుము(రూపాయిలలో)
నీలగిరి	లాంగ్‌వుడ్ సోలా	3	699
నీలగిరి	పార్సల్ పల్లతాకు-ముకూర్తి హట్	20	4,499
నీలగిరి	అవలాంజి-కోలరిపేట	18	4,759
నీలగిరి	నీటిల్ రాక్	4	3,399
కోవై	టాప్‌స్లిప్-పాండరవరై	8	4,699
కోవై	ఆళియారు కాలువ వరకు	8	1,999
కోవై	వెల్లియంగిరి కొండ	12	5,099
తెన్‌కాశి	తీర్థపారై	6	799
తిరుపత్తూర్	ఏలగిరి-స్వామిమలై	6	799
తిరువళ్లూర్	కుడియం గుహ	9	949

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అనుమతిచ్చిన 40 మార్గాల్లో కొండలపై టెక్కింగ్‌కు వెళ్లేవారు, తమ పేర్ల నమోదుకు 'ఆన్‌లైన్' సౌకర్యాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి గురువారం ప్రారంభించారు. రాష్ట్రంలో 40 కొండలు ఎక్కేందుకు రూట్ మ్యాప్ తయారుచేయాలని ప్రభుత్వ ఉత్తర్వులతో, డిజిటల్ మ్యాప్‌లు రూపొందాయి. రాష్ట్రవ్యాప్తంగా 14 జిల్లాల్లోని 40 కొండ మార్గాల్లో ట్రెక్కింగ్‌కు వెళ్లేందుకు అటవీ శాఖ అనుమతించింది. వాటిలో సులభతంగా వెళ్లే మార్గాలు 14, కొంత కఠినంగా ఉండే మరో 14 మార్గాలు, కఠినంగా ఉండేవి 12 మార్గాలు రూపొందించారు. ఈ మార్గాల్లో ట్రెక్కింగ్ వెళ్లే వారు తమ పేర్లు నమోదుచేసుకొనేలా www.trektamilanadu.com అనే వెబ్‌సైట్ పరిచయం చేశారు. 18 ఏళ్ల పైబడిన వారు పేరు నమోదుచేసుకోవచ్చు. అదే సమయంలో 18 ఏళ్ల వారు తల్లిదండ్రులు, సంరక్షకుడి అనుమతి పత్రం అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలాగే, పదేళ్ల వయస్సు వారు కూడా సులభంగా ట్రెక్కింగ్‌కు వెళ్లేలా కొన్ని మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు, గిరిజన వర్గాలకు చెందిన వారిని గైడ్లుగా వినియోగించనున్నారు. వారికి అవసరమైన అన్నిరకాల పరికరాలు సమకూర్చనున్నారు. ట్రెక్కింగ్ వెళ్లే మార్గాన్ని బట్టి రూ.700 నుంచి రూ.5,999 రుసుముగా నిర్ణయించారు. అటవీ శాఖ అధికారులు సూచించే ప్రాంతాలకు నమోదుచేసుకున్న వారు వెళితే, అక్కడి నుంచి గైడ్లు వారికి తీసుకెళ్లనున్నారు. ఒక్కో మార్గానికి సంబంధించిన పూర్తి వివరాలు, ఫొటోలు, వీడియోలు కూడా కొత్త వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ఉపాధి కార్మికుల ఆందోళన



ఆందోళనలో కార్మికులు

వేలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తంలో ఉపాధి హామీ కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. అగ్రహారం పంచాయతి కార్యాలయం సమీపంలో చేపట్టిన ఆందోళనలో కార్మికులకు మద్దతుగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే లత మాట్లాడుతూ... ఉపాధి రోజులు తగ్గించరాదని, ప్రభుత్వ సెలవు రోజుల్లోనూ కూలీలకు వేతనాలివ్వాలని, పనులు ముగిసిన మూడు రోజుల్లో వేతనాలు అందజేయాలని, ఈ పథక అమలుకు ప్రత్యేక శాఖ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో యూనియన్ సెక్రటరీ పరమశివం, జిల్లా ఉప కార్యదర్శి దొరైసెల్వం, ప్రేమ్‌కుమార్, యూనియన్ సెక్రటరీ ఆనందన్, ఢిల్లీ మహేష్‌బాబు, అక్తర్, వేలాయుధం, పళని, కుమరవేల్, పిచ్చైముత్తు, తిరునావుక్కరసు, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సహాయాల పంపిణీ



దివ్యాంగులకు సహాయాలు అందిస్తున్న నిర్వాహకులు

వేలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏంజల్స్ సంస్థ తరఫున దివ్యాంగులకు సహాయాల పంపిణీ గురువారం రాత్రి జరిగింది. కాట్పాడి సమీపంలోని ఆక్సీలియం కళాశాల రోడ్డులో జరిగిన కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు నల్లమై రామనాథన్ పాల్గొని, గ్రీన్‌వే ట్రస్ట్ క్రీడాకారులకు రూ.25 వేల చెక్ అందజేశారు. అలాగే, క్రీడాకారులు, దివ్యాంగులు మొత్తం 10 మందికి సుమారు రూ.10 వేల విలువైన షూలు అందించారు. అలాగే, సేన్‌పాక్కంకు చెందిన మహిళకు రూ.4,500 విలువైన వీల్‌ఛైర్ అందించారు. కార్యక్రమంలో గ్రీన్‌వే ట్రస్ట్, ఏంజల్ సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

కేఎంసీ హాస్టల్‌లో విద్యార్థిపై ర్యాగింగ్

● బీరుబాటిల్స్‌తో తలపై కొట్టిన సీనియర్లు

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కీల్పాక్ ప్రభుత్వ వైద్యకళాశాల (కేఎంసీ) హాస్టల్‌లో ఉంటున్న మూడో సంవత్సరం విద్యార్థిపై సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. మద్యం మత్తులో బీర్‌బాటిళ్లతో దాడి చేసి చిత్రహింసలకు గురిచేశారు నైవేలికి చెందిన ఆండ్రో హలన్ అనే మూడో సంవత్సరం విద్యార్థి ఆ కళాశాల హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి క్యాంటీన్‌లో భోంచేసి గదికి వెళుతున్న హలన్‌ను మద్యం మత్తులో ఉన్న ఫైనల్ ఇయర్ విద్యార్థులు కవిన్ (24), ధ్యానేష్(24) అడ్డుకుని ర్యాగింగ్ చేశారు. ఆ తర్వాత మరికొంతమంది జూనియర్ విద్యార్థులకు తమ వద్దకు తీసుకురమ్మంటూ చెప్పారు. దీంతో హలన్ హాస్టల్ గది వైపు నెమ్మదిగా నడిచి వెళుతుండటం చూసి, సీనియర్లు చెబితే పరుగెత్తుకెళ్లి పిలుచుకురావాలనే ధ్యాసలేదా అంటూ ఆగ్రహంతో బీరు బాటిల్‌తో ఇద్దరూ అతడి తలపై బాదారు. దీంతో తీవ్రంగా గాయపడిన హలన్ నేలపై పడ్డాడు. ఆ తర్వాత సీనియర్ విద్యార్థులు అక్కడి నుండి పరారయ్యారు. హలన్ ర్యాగింగ్‌కు గురైనట్లు తెలుసుకుని నైవేలి నుండి అతడి తండ్రి చెన్నైకి బయలుదేరారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

ఘనంగా కృపానంద వారియార్

31వ గురుపూజోత్సవం



కృపానంద వారియార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్సార్కే అప్పు

వేలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమురుగ కృపానంద వారియార్ 31వ గురుపూజోత్సవం శుక్రవారం నిర్వహించారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఉత్తర్వులతో నగరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ ఎస్సార్కే అప్పు పాల్గొని, కృపానంద వారియార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తిరుపత్తూర్ పార్టీ సెక్రటరీ వీరమణి, ఎమ్మెల్యే సేవూరు రామచంద్రన్, నిర్వాహకులు రాము, వేల్ అయగన్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కర్ల కర్మాగారంలో భారీ అగ్నిప్రమాదం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైనవాటిని పరిశీలిస్తున్న కార్మికుడు

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సేలం నగరంలో కుక్కర్ల కర్మాగారంలో శుక్రవారం వేకువజామున సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో లక్షలాది రూపాయల విలువచేసే పరికరాలు దగ్ధమయ్యాయి. సేలం వండిక్కార వీధిలో రాజస్థాన్‌కు చెందిన దేక్‌రాజ్ (50) కుక్కర్ల తయారీ కర్మాగారాన్ని నడుపుతున్నారు. గురువారం రాత్రి ఆ కర్మాగారంలో పనిచేసే కార్మికులు, మేనేజర్ మాతేష్ డ్యూటీ పూర్తయిన తరువాత ఇళ్లకు వెళ్లారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వేకువజాము ఐదు గంటల ప్రాంతంలో ఆ ఫ్యాక్టరీ నుండి దట్టమైన పొగలు వచ్చి, కాసేపటికి మంటలు చెలరేగాయి.స్థానికులు గమనించి వెంటనే మేనేజర్ మాతేష్‌కు ఫోన్‌చేసి తెలిపారు. వెంటనే ఆయన అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు ఫిర్యాదు చేసి ఫ్యాక్టరీకి చేరుకున్నారు.పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి హుటాహుటిన చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో కుక్కర్ల తయారీకి ఉపయోగపడే ముడి పరికరాలన్నీ కాలిబూడిదయ్యాయి. ఈ సంఘటనపై అన్నదానపట్టి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగించిన ఎస్పీ



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ మదివానన్

వేలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ప్రాంతాల్లో అగంతకులు సెల్‌ఫోన్ దొంగలించి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదులతో చర్యలు చేపట్టిన పోలీసులు, దొంగల నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సత్తువాచేరి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను వాటి యజమానులకు ఎస్పీ మదివానన్ అందజేశారు.

దేవర్ జయంతి కోసం స్వర్ణకవచాల అప్పగింత



బ్యాంక్ అధికారుల నుంచి స్వీకరించిన దేవర్ విగ్రహ స్వర్ణకవచాలకు మొక్కుతున్న అన్నాడీఎంకే నేతలు

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా అక్టోబరు 30 జరిగే స్వాతంత్ర్య సమరయోధుడు పసుంపొన్ ముత్తురామలింగదేవర్ జయంతి సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జయలలిత అన్నాడీఎంకే తరఫున కానుకగా ఇచ్చిన స్వర్ణకవచాలను ఆయన విగ్రహానికి ధరింపజేయడం ఆనవాయితీ. ఆ మేరకు శుక్రవారం ఉదయం మదురై అన్నానగర్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్‌లో భద్రపరచిన స్వర్ణకవచాలను అన్నాడీఎంకే కోశాధికారి దిండుగల్ శీనివాసన్‌కు బ్యాంక్ అధికారులు అందజేశారు. గట్టి పోలీసు భద్రతా ఏర్పాట్ల నడుమ రూ.3 కోట్ల విలువైన ఆ స్వర్ణకవచాలను ప్రత్యేక వాహనంలో రామనాథపురం పసుంపొన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు నత్త విశ్వనాధన్, సెల్లూరు రాజు, ఆర్బీ ఉదయకుమార్, మణికంఠన్, శాసనసభ్యులు రాజన్ చెల్లప్ప, పెరియుల్లాన్, డాక్టర్ శరవణన్, ఎస్ఎస్ శరవణన్ అన్నాడీఎంకే ప్రముఖులు పాల్గొన్నారు.

కాలువలో ఆవిన్ పాల ప్యాకెట్లు



కాలువలో పడేసిన కాలపరిమితి ముగిసిన పాల ప్యాకెట్లు

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరునీర్‌మలై కాలువలో ఆవిన్ పాల ప్యాకెట్లు పడి ఉండడంతో స్థానికులు దిగ్భ్రాంతి చెందారు. తిరునీర్‌మలై, వీరరాఘవన్ చెరువుల నుంచి విడుదల చేసే అదనపు జలాలు తాంబరం కార్పొరేషన్ పరిధిలోని క్రోంపేట సమీపం తిరునీర్‌మలై కాలువగుండా అడయార్ నదిలో కలుస్తాయి. ఈ నేపథ్యంలో, కాలపరిమితి చెందిన ఆవిన్ ప్యాకెట్లు ఈ కాలువలో పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. సాధారణంగా ఆవిన్ పాల పార్లర్లలో కాలపరిమతి చెందిన పాల ప్యాకెట్లను ఆవిన్ సంస్థకు తిరిగి అప్పగిస్తుంటారు. కానీ, ప్రస్తుతం కాలువలో పాల ప్యాకెట్లు పడేసిన వ్యవహారంపై విచారణ చేపట్టినట్లు కార్పొరేషన్ కమిషనర్ బాలచందర్ తెలిపారు.

డీజిల్ ఇంజిన్‌తో ఊటీ కొండరైలు ట్రయల్ రన్

అడయార్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో కున్నూరు - మేట్టుపాళెయం ప్రాంతాల మధ్య నడిచే ఊటీ కొండరైలును డీజిల్ ఇంజిన్‌తో శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ రైలుకు ఉపయోగించే ఎక్స్ క్లాస్ ఇంజిన్‌కు ఫర్నేస్ ఆయిల్ ఉపయోగించి నడుపుతున్నారు. ఇపుడు ఫర్నేస్ ఆయిల్ స్థానంలో డీజిల్ ఉపయోగించి ట్రయల్ రన్ నిర్వహించారు. ఎక్స్ క్లాస్ ఫర్నేస్ ఇంజిన్‌ను కున్నూరు రైల్వే యార్డులో డీజిల్ ఇంజనుగా మార్పు చేశారు. ఈ ఇంజనుతో మూడు బోగీలు కలిగిన ఊటీ కొండ రైలు ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. దీంతో కున్నూరు - మేట్టుపాళెయం ప్రాంతాల మధ్య డీజిల్ ఇంజిన్‌తో కూడిన కొండ రైలును ప్రయాణికుల రాకపోకలకు ఉపయోగించనున్నారు.

చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన



పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కంలో మద్రాస్ క్రిస్టియన్ కాలేజ్ హయ్యర్ సెకండరీ స్కూలు ఆధ్వర్యంలో శుక్రవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. 'ఫైటింగ్ వాటర్ పొల్యూషన్ టుగెదర్' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్కూలు ప్రధానోపాధ్యాయులు జి.జబదాస్ దినకరన్ ఆహ్వానం పలికారు. ముఖ్యఅతిథిగా హెచ్ఈసీఎస్ డైరెక్టర్ అభిషేక్ మోజస్, గౌరవ అతిథిగా హెచ్ఈసీఎస్ సీఈఓ డా.జేఆర్ మోజస్ పాల్గొని, చిత్రలేఖనం, గ్లాస్ పెయింటింగ్, క్లే మోడలింగ్ తదితర పోటీల విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. డ్రాయింగ్ టీచర్లు ఐ.క్రిస్టీ, ఏఎస్ జోసఫ్ సామ్యూల్ పర్యవేక్షణలో సాగిన ఈ పోటీల్లో చెన్నై, చెంగల్పట్టు, తిరువళ్లూర్, కాంచీపురం జిల్లాల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన రైతు సమస్యల పరిష్కార సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుబ్బలక్ష్మి

మహిళలకు 'పింక్ పార్క్'



పార్క్ ప్రారంభిస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళి, మంత్రి గీతాజీవన్

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడిలో మహిళల కోసం ఏర్పాటుచేసిన 'పింక్ పార్క్'ను ఎంపీ కనిమొళి, మంత్రి గీతాజీవన్‌లు శుక్రవారం ప్రారంభించారు. అలాగే, తూత్తుకుడిలో కొత్త పాఠశాల భవనాలు, తిరుచెందూర్‌కు పాదయాత్రగా వెళ్లే భక్తులకు పార్క్ తదితరాలను ఎంపీ, మంత్రి ప్రారంభించారు. పింక్ పార్క్‌లో మహిళలకు ప్రత్యేక వ్యాయామం, మానసిక ఒత్తిడి అధిగమించేలా కౌన్సెలింగ్, కర్రసాము, కరాటే తదితర శిక్షణలు, మహిళల భద్రత, రక్షణ అంశాలకు సంబంధించి సెమినార్లు నిర్వహించనున్నట్లు ఎంపీ కనిమొళి తెలిపారు.



తూత్తుకుడిలో తన ఎంపీ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళి

ఈపీఎస్‌కు హైకోర్టు నోటీసు

అడయార్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పార్టీకి కళంకం తెచ్చేలా ఎక్స్ ఖాతాలో తప్పుడు పోస్టులు చేసిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామిపై డీఎంకే ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ఎస్ భారతి దాఖలు చేసిన పరువునష్టం దావా కేసులో మద్రాస్ హైకోర్టు నోటీసు జారీ చేసింది. ఈ కేసులో వారం రోజుల్లో ఈపీఎస్ సమాధానం చెప్పాలంటూ హైకోర్టు ఆదేశించింది. మాదకద్రవ్య అక్రమ రవాణా కేసులో సినీ నిర్మాత జాఫర్ సాధిక్‌ను ఢిల్లీ నార్కోటిక్ విభాగం మార్చి నెలలో అరెస్టు చేసింది. అయితే, జాఫర్ సాధిక్‌కు డీఎంకేకు సంబంధాలున్నాయంటూ ఎడప్పాడి తన ఎక్స్ ఖాతాలో వరుసగా ట్వీట్లు చేశారు. వీటిని తీవ్రంగా పరిగణించిన ఆర్ఎస్ భారతి మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తప పార్టీకి కళంకం తెచ్చేలా ఎడప్పాడి చేసిన ట్వీట్లను తొలగించాలని, అసత్య సమాచారంతో ట్వీట్లు చేసినందుకు పరువు నష్టం చెల్లించేలా ఆదేశించాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు... వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ ఈపీఎస్‌కు నోటీసులు జారీచేసింది.

శశికళ అనుచరుడి ఇంటిలో ఐటీ సోదాలు

అడయార్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళకు బలమైన అనుచరుడు, వ్యాపారవేత్త దివంగత వెంకటరామన్‌కు చెందిన ఇల్లు, పేపర్ మిల్లులు, ఆస్పత్రుల్లో ఆదాయపన్ను శాఖ అధికారులు తనిఖీలు చేశారు. కొన్ని చోట్ల ఒక రోజు మాత్రమే తనిఖీ చేయగా, మిల్లులో మాత్రం శుక్రవారం కూడా తనిఖీలు కొనసాగాయి. విరుదునగర్ జిల్లా సాత్తూరు సమీపంలోని చిదంబరం నగర్‌కు చెందిన వెంకటరామన్ అనే వ్యక్తికి పేపర్ మిల్లు, ఆస్పత్రులు, ఇతర వ్యాపారాలు న్నాయి. శశికళకు ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందారు. ఈయన మరణానంతరం వ్యాపార కార్యకలాపాలన్నీ ఆయన కుమారుడు వినోద్ నడుపుతున్నారు. ఈ క్రమంలో వ్యాపార సంస్థల ఐటీ చెల్లింపుల్లో అవకతవకలు జరిగినట్టు అధికారులు గుర్తించారు. దీంతో గురువారం ఉదయం నుంచి ఐటీ అధికారులు తనిఖీలు చేశారు. అయితే, సాత్తూరు, తిరుపూరు జిల్లా ఉడుమలైపేటలో ఉన్న పేపర్ మిల్లుల్లో మాత్రం శుక్రవారం వరకు ఐటీ సోదాలు జరిగాయి.

ఆటో డ్రైవర్ దారుణహత్య

● ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరునింద్రవూర్ సమీపంలోని నడుగుత్తై ప్రాంతంలో ఓ మహిళ వ్యవహారంలో ఆటోడ్రైవర్‌ను దారుణంగా హతమార్చిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. నడుగుత్తై గంగయమ్మన్ ఆలయ వీధికి చెందిన విఘ్నేష్ మూలకడై ప్రాంతంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఆయన మృతదేహం గురువారం ఆయన ఇంటి వెనుక పడి ఉండగా చుట్టుపక్కల వారు చూసి తిరునింద్రవూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జగన్నాథన్ కేసు నమోదుచేసి జరిపిన విచారణలో... గురువారం విఘ్నేష్ అదే ప్రాంతానికి చెందిన జేమ్స్‌తో కలసి మద్యం తాగుతుండగా రియాజ్ అనే రౌడీ ముగ్గురు స్నేహితులతో కలసి అక్కడకెళ్లారని, ఆ సమయంలో ఏర్పడిన గొడవల కారణంగా ఆటో డ్రైవర్ విఘ్నేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించారు. దీంతో, శివకుమార్, జేమ్స్‌లను అరెస్ట్ చేసి తిరువళ్లూర్ న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

● మాదకద్రవ్యాల కేసు వ్యవహారం

మాజీ డీజీపీ కుమారుడి అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో మాదకద్రవ్యాల స్మగ్లింగ్ వ్యవహారంలో మాజీ డీజీపీ రవీంద్రనాథ్ కుమారుడు అరుణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రాజధాని నగరంలో ప్రభుత్వం నిషేధించిన మాదకద్రవ్యాల వినియోగాన్ని అడ్డుకొనేలా పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. ప్రధానంగా పొరుగు రాష్ట్రాలు, విదేశాల నుంచి డ్రగ్స్‌ను దిగుమతి చేసుకొని గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు చేస్తున్న వారి కదలికలపై కన్నేసింది. ఈ నేపథ్యంలో నందంబాక్కంలో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నారనే రహస్య సమాచారంతో గురువారం ఆ ప్రాంతంలో నిఘావేసిన పోలీసులు, జాన్‌ఎసీ, మెక్లన్, అరుణ్ అనే ముగ్గురిని అనుమానంతో అదుపులోకి తీసుకొని వారిని తనిఖీ చేసి 2.5 గ్రాముల మెటాబెటామిన్ అనే మాదకద్రవ్యం, రూ. లక్ష నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా. జాన్‌ఎసీ నైజీరియాకు చెందిన వ్యక్తికాగా, అరుణ్ మాజీ డీజీపీ రవీంద్రనాథ్ కుమారుడని తెలిసింది.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● హెచ్‌ఎం అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేట సమీపంలోని ఓలయనూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఆదిద్రావిడ సంక్షేమ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దురైఅరసన్ (52)ను గూండా చట్టం కింద అరెస్ట్ చేశారు. విద్యార్థినులకు సెల్‌ఫోన్‌లో అశ్లీల దృశ్యాలు చూపించి వారిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని దురైఅరసన్‌పై విద్యార్థినుల తల్లిదండ్రులు ఉళందూర్‌పేట మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ప్రతిపాదన మేరకు ఎస్పీ రజత్‌చతుర్వేది జారీచేసిన ఉత్తర్వుల మేరకు, దురై అరసన్‌పై గూండా చట్టం ప్రయోగించి గురువారం అరెస్ట్ చేసి కడలూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

బస్సును ఢీకొన్న మినీలారీ

డ్రైవర్ సహా ఇద్దరి మృతి



బస్సును ఢీకొని ధ్వంసమైన మినీ లారీ

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా నాంగునేరి వద్ద శుక్రవారం ఉదయం ఓ మినీ లారీ రాష్ట్ర రవాణా సంస్థ బస్సును ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. చెన్నై నుంచి కేరళలోని తిరునంతపురానికి వస్తువుల లోడుతో ఓ మినీలారీ గురువారం సాయంత్రం బయలుదేరింది. తిరునల్వేలి జిల్లా జేజేనగర్‌కు చెందిన మహేష్ (20) దానికి డ్రైవర్ గా ఉన్నాడు. శుక్రవారం వేకువజాము ఆ మినీలారీ నాంగునేరి సమీపం రైల్వేఫ్లైఓవర్ వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న నాగర్‌కోవిల్ - తిరునల్వేలి బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ లారీ ముందుభాగం పూర్తిగా ధ్వంసంకాగా, డ్రైవర్ మహేష్, ఉసిల్‌వేల్ (36) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి ఘటనాస్థలంలోనే మృతిచెందారు. ఈ సమాచారం అందగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని శిథిలాల మధ్య చిక్కుకున్నమృతదేహాలను వెలికి తీశారు. మూంద్రైయడుప్పు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

డైరెక్టర్ గాంధీ కృష్ణ కొత్త చిత్రం 'బ్రేక్‌పాస్ట్'

విశాల్ హీరోగా 'చెల్లమే', తమన్నా ప్రధానపాత్రలో 'ఆనంద తాండవం' వంటి చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు గాంధీ కృష్ణ తాజాగా 'బ్రేక్‌పాస్ట్' పేరుతో కొత్త చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రణవ్, రోస్లిన్, కృతిక్ మోహన్, అమిత రంగనాథన్, అర్సన్, సంపత్‌రాం, రవిమారియ తదితరులు నటించారు. ప్రేమ్ క్లాసిక్ పిక్చర్స్ పతాకంపై గిరిజా వరదరాజన్ నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చుతున్నారు. ఈ వివరాలను దర్శకుడు గాంధీ కృష్ణ వివరిస్తూ, 'మన సంస్కృతిలో చోటుచేసుకున్న మార్పుల గురించి చెప్పే చిత్రం. టచ్ స్క్రీన్ అందుబాటులోకి వచ్చిన పదేళ్ళకాలంలో జరిగిన సాంస్కృతిక, మానసిక మార్పులను వివరించనున్నాం. ఇది ఒక ప్రేమకథా చిత్రమైనప్పటికీ హాస్యం, సెంటిమెంట్ కూడా ఉంటుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేశాం. పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి' అని పేర్కొన్నారు.


'బ్రేక్‌పాస్ట్'లో ఓ దృశ్యం

చిత్రజ్యోతి

సూర్య సరసన రుక్మిణీ వసంత్



హీరో సూర్య నటించే 45వ చిత్రం గురించి సరికొత్త అప్‌డేట్ ఒకటి వెలుగులోకి వచ్చింది. ఒక హీరోయిన్‌గా రుక్మిణీ వసంత్ పేరు ఖరారు చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. సిరుత్తై శివ దర్శకత్వంలో సూర్య హీరోగా నటించిన 'కంగువా' చిత్రం వచ్చే నెల 14వ తేదీ విడుదలకానుంది. ఆ తర్వాత కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో తన 44వ చిత్రంలో నటించనున్నారు. ఆ తర్వాత హీరో సూర్య ఎవరి దర్శకత్వంలో నటిస్తారన్న చర్చ సాగింది. కానీ, ఎవరూ ఊహించని విధంగా 45వ చిత్రాన్ని ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఏఆర్.రెహ్మాన్ సంగీతం. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్‌ఆర్ ప్రకాష్, ఎస్‌ఆర్ ప్రభులు సంయుక్తంగా నిర్మించనున్నారు. నవంబరు నెలలో సెట్స్‌పైకి వెళ్ళనుంది. సూర్య సరసన హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ లేదా రుక్మిణీ వసంత్ పేర్లను పరిశీలించి, చివరకు రుక్మిణి పేరును ఖరారు చేసినట్టు సమాచారం.

నా విజయానికి అజిత్ కారణం

● యువన్ శంకర్ రాజా

తన విజయానికి అగ్రహీరో అజిత్ కుమార్ కారణమని ప్రముఖ సంగీత దర్శకుడు యువన్ శంకర్ రాజా అన్నారు. శరత్ కుమార్ హీరోగా నటించిన 'అరవిందన్' చిత్రం ద్వారా కోలీవుడ్‌లో యువ సంగీత దర్శకుడుగా అరంగేట్రం చేసిన యువన్ శంకర్ రాజా.. ఈ చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత ఆయన సంగీతం అందించిన పలు చిత్రాలు వరుసగా నిరాశపరిచాయి. దీంతో యువన్‌కు నెగెటివ్ పేరు వచ్చింది. ఆ సమయంలో హీరో అజిత్ తాను నటించిన 'దీనా' చిత్రానికి పనిచేసే అవకాశం ఇచ్చారు. ఈ విషయంపై యువన్ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పందిస్తూ, 'నాకు అదృష్టం లేదంటూ నిరాశపరిచేలా పలువురు కామెంట్స్ చేశారు. ఆ సమయలో అజిత్ పిలిచి 'దీనా' సినిమాకు సంగీతం సమకూర్చాలని, ఈ సినిమాలో ప్రతిభ నిరూపించుకోవాలని సలహా ఇచ్చారు. 'దీనా' చిత్రం పాటలు సూపర్‌హిట్ అయ్యాయి. సినిమా కెరీర్‌లో నాకు ఒక కంబ్యాక్ మూవీగా నిలిచింది. దీనికి ప్రధాన కారణం అజిత్. అందువల్ల నా విజయానికి అజిత్ కారణం' అని పేర్కొన్నారు.



ప్రేక్షకులతో కలిసి 'సర్' విజయోత్సవ వేడుకలు

ప్రముఖ నటుడు బోస్ వెంకట్ దర్శకత్వంలో విమల్ హీరోగా నటించిన 'సర్' చిత్రం ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతుంది. దీనిని పురస్కరించుకుని చిత్ర విజయోత్సవ వేడుకలను చిత్ర బృందం ఓ థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి జరుపుకున్నారు. ఎస్ఎస్ఎస్ పిక్చర్స్ పతాకంపై సిరాజ్.ఎస్ నిర్మించిన సామాజిక స్పృహతో తెరకెక్కింది. తిరుపూర్‌లోని శక్తి సినిమాస్‌లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్య అనే ఆయుధం మన సమాజంలో తీసుకొచ్చిన మార్పు, గ్రామీణ ఉపాధ్యాయులు ఎదుర్కొనే సమస్యలను తెరకెక్కించారు. ఈ విజయోత్సవ వేడుకల్లో శక్తి సినిమాస్ యజమాని కార్తీక్ సుబ్రమణ్యం మాట్లాడుతూ, 'తమిళ చిత్రసీమలో మంచి ఆలోచనలు, సామాజిక స్పృహతో కూడిన చిత్రాలు రావడం అభినందనీయం. ప్రేక్షకుల హృదయాలకు కథ దగ్గరగా ఉంటే చిన్న సినిమా అయినా దాన్ని పెద్ద హిట్ చేస్తారు. దీనికి మంచి ఉదాహరణ తాజాగా వచ్చిన 'లబ్బర్ పందు' సినిమానే. విద్య ఆవశ్యకత గురించి చెప్పే ఇలాంటి చిత్రాన్ని రూపొందించిన దర్శకుడు బోస్ వెంకట్‌కు ప్రత్యేకించి ధన్యవాదాలు' తెలిపారు. హీరో విమల్ మాట్లాడుతూ, 'సర్ కథ వినగానే పెద్ద హిట్ అవుతుందని ఊహించాను. ప్రేక్షకుల స్పందన, అభిమానుల మద్దతు ఈ విజయానికి కారణం. ఈ సినిమా కోసం ఎంపిక చేసిన దర్శకుడు బోస్ వెంకట్‌కు ఆయన ధన్యవాదాలు' తెలిపారు. దర్శకుడు బోస్ వెంకట్ మాట్లాడుతూ, 'పెద్ద సినిమాలకు మించి చిన్న సినిమాలకు ఆదరణ లభించడం ఎంతో సంతోషంగా ఉంది. వారాంతపు రోజుల్లోనేకాకుండా, సాధారణ రోజుల్లో కూడా కలెక్షన్స్ బాగున్నాయి' అని వెల్లడించారు.


విజయోత్సవ వేడుకల్లో బోస్ వెంకట్, విమల్ తదితరులు


పెరుంజాని డ్యామ్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న జలాలు

కుమరిలో కుండపోత

● స్తంభించిన జనజీవనం

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం వేకువజాము వరకూ కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. భారీ వర్షాల కారణంగా ఆ జిల్లాలో శుక్రవారం పాఠశాలలకు సెలవు కూడా ప్రకటించారు. కుండపోత వర్షాల కారణంగా మోదిర్‌మల్లై, కల్లారు. కిళవిఆరు, కుట్రియారు ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. నాగర్‌కోవిల్‌లోనూ గురువారం రాత్రి నుంచి శుక్రవారం వేకువజాము వరకు చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. అసంబురోడ్డు, కోట్టార్‌రోడ్డు, మీనాక్షిపురం రోడ్డు తదితర రహదారుల్లో వర్షపు నీరు వరదలా ప్రవహించింది. ఇదేవిధంగా పేచ్చిపారై, పెరుంజాని డ్యామ్‌లలో నీటిమట్టం పెరిగింది. ఆ డ్యామ్‌ల నుంచి అదనపు జలాలను విడుదల చేస్తున్నారు. డ్యామ్ పరీవాహక ప్రాంతాల్లో ప్రత్యేకించి లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్నవారిని రెవెన్యూ అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పేచ్చిపారైలో 28.8 మి.మీ.లు, పెరంజానిలో 55.6 మి.మీ.లు, మైలాడిలో 65.2 మి.మీ.లు, ఇరానియల్‌లో 98.6 మి.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు.


కన్నియాకుమారిలో వర్షాల కారణంగా బోసిపోయిన త్రివేణి సంగమ ప్రాంతం

చమురుతెట్టు కేసులో సీపీసీఎల్‌కు రూ.73 కోట్ల జరిమానా

● కాలుష్య నియంత్రణ మండలి ప్రకటన


మనలి సముద్రతీరంలో ఏర్పడిన చమురుతెట్టు (ఫైల్‌ఫొటో)

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన మనలి వద్ద గతేడాది డిసెంబర్‌లో భారీ వర్షాల సందర్భంగా సముద్రతీర ప్రాంతం వద్ద చమురుతెట్టు ఏర్పడటానికి కారణమైన సీపీసీఎల్ సంస్థకు రాష్ట్ర కాలుష్య నియంత్రణా మండలి రూ.73 కోట్ల జరిమానా విధించింది. ఆ చమురుతెట్టు కేసు విచారిస్తున్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ దక్షిణ మండల కమిటీ ఎదుట రాష్ట్ర కాలుష్య నియంత్రణా మండలి సమర్పించిన నివేదికలో ఈ విషయాన్ని ప్రకటించింది. జస్టిస్ పుష్పా సత్యనారాయణ, సాంకేతిక కమిటీ సభ్యులు కె.సత్యగోపాల్‌తో కూడిన కమిటీ ఎదుట చమురుతెట్టు కేసు విచారణకు వచ్చింది. కాలుష్య నియంత్రణా మండలి తరపు న్యాయవాది సాయిసత్యజిత్ హాజరై చమురుతెట్టు ఏర్పడిన ప్రాంతాల్లో సేకరించిన నమూనాల ఆధారంగా సీపీసీఎల్ సంస్థ రూ.73 కోట్లు నష్టపరిహారంగా చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఆ సంస్థపై కాలుష్య నియంత్రణా మండలి తగు చర్యలు చేపట్టనున్నదని తెలిపారు. ప్రభుత్వ తరపు న్యాయవాది షణ్ముగనాధన్ జోక్యం చేసుకుంటూ కాలుష్య నియంత్రణా మండలి విధించిన జరిమానా (నష్టపరిహారం) చాలదని, ఆ జరిమానా పెంచాలని అభ్యర్థించారు. దీంతో కేసు తదుపరి విచారణను వచ్చే యేడాది జనవరి 24కు వాయిదా వేశారు.



తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెంచుకుంటారు. కొంతమంది తల్లిదండ్రులు తమకిష్టమైన రంగంలోనే పిల్లలు రాణించాలనుకుంటారు. మరికొంతమంది తమ ఆసక్తికి అనుగుణంగా, తమ పిల్లల్లో స్ఫూర్తి నింపుతూ తమకిష్టమైన రంగాన్ని పిల్లలు కూడా ఇష్టంగా చేసుకొనేలా బాల్యం నుంచే ప్రేరణ కలిగించి, ఆ దిశగా ప్రోత్సహించే తల్లిదండ్రులు కూడా ఉన్నారు. అలాంటి కోవకు చెందిన వారి పిల్లలు తల్లిదండ్రులకిష్టమైనదే తాము ఇష్టంగా చేసుకొని ఆ రంగంలో ఉన్నతిని సాధిస్తుంటారు. దానికి అచ్చమైన నిరూపణ డా.కె.అనుపమ. ఆమె వైద్యప్రస్థానం నేటి 'తరుణి'లో....

\- వేళచ్చేరి

మహిళల చికిత్సలో ప్రత్యేకం

వైద్యవృత్తిలో 'అనుపమానం'

తరుణి

'నాకు బాల్యంలో డాక్టర్ కావాలన్న కోరిక లేదు... కానీ నా తండ్రికి వైద్య వృత్తి అంటే చాలా అభిమానం. నన్ను డాక్టర్‌గా చూడాలన్నది ఆయన అభిమతం. అయితే ఏనాడూ డాక్టర్ కోర్సే చదవాలని నాపై ఒత్తిడి తేలేదు. ఆ కోర్సుపై నాకు ఆసక్తి కలిగేలా, నేను మమకారం పెంచుకొనేలాగా నాకు స్ఫూర్తి కలిగించారు, అందుకే బాల్యం నుంచి డాక్టర్ కావాలన్న కోరిక బలపడింది. పట్టుదల పెరిగింది. చివరకు విజయం సాధించాను. మెడిసిన్‌లో సీటు సంపాదించాను' అని తన వైద్య విద్యకు శ్రీకారం ఎలా చుట్టబడిందో తెలుపుతూ అన్నారు డా.అనుపమ.

కుటుంబ నేపథ్యం...

ఆంధ్రప్రదేశ్‌లోని గుడివాడలో జన్మించారు అనుపమ. తల్లి ఉమాదేవి గృహిణి. తండ్రి కాట్రగడ్డ బుచ్చి మోహనరావు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదవీవిరమణ చేశారు. అనుపమకు ఒక సోదరుడు. ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం పాల్వంచలో జరిగింది. ఆ తర్వాత విజయవాడలోని రామకృష్ణా విద్యాలయంలో పదవ తరగతి వరకు చదివారు. విజయవాడలోని మేరీస్ స్టెల్లా కళాశాలలో ఇంటర్ పూర్తిచేశారు. ఆ తర్వాత గుంటూరు మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.ఎస్, వేలూరులో పి.జి చేశారు. లాప్రోస్కోపిక్, అల్ట్రాసౌండ్‌లకు సంబంధించిన సర్టిఫికెట్ కోర్సులను చేశారు. వైద్య విద్య పూర్తయిన తరువాత చెన్నైలోని విజయా హాస్పిటల్‌లో ఏడాదిన్నరపాటు సేవలందించారు. ఆపైన కాంచీపురంలోని మీనాక్షి మెడికల్ కాలేజీలో ఏడేళ్లపాటు పనిచేశారు. ప్రస్తుతం శ్రీ పెరుంబుదూర్‌లోని సవిత మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో గైనకాలజిస్టుగా 15 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారు.

కోవిడ్ మహమ్మారి దేశంలో వ్యాపించక ముందు అనుపమ తన సొంత క్లినిక్‌ని నడిపేవారు. అనుపమ భర్త బాబు మెహతా హాస్పిటల్‌లో పీడియాట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. ఈ దంపతులకు ఒక కుమార్తె, కూతురు, అల్లుడు కూడా డాక్టర్లే. తనకు అన్ని విషయాలలోను భర్త ప్రోత్సాహం, సహకారం ఉంటుందని అనుపమ తెలిపారు. తనకు ఉమ్మడి కుటుంబం అంటే ఎంతో ఇష్టమని చాలా సంవత్సరాలు ఉమ్మడి కుటుంబంలోనే ఉండి, ఎన్నో విషయాల పట్ల అవగాహన పెంచుకున్నానని అనుపమ తెలిపారు. తన అత్తమామలు తనకు అన్ని విషయాలలోను అండగా ఉంటారని తెలిపారు.


భర్త బాబుతో...

బాల్యం నుంచి సంస్కృతీ, సంప్రదాయా మధ్య పెరిగిన అనుపమకు ఆధ్యాత్మిక విషయాలు, తీర్థయాత్రలు అంటే ఎంతో మక్కువ. కేదార్‌నాథ్, బదరీనాథ్, హరిద్వార్, కాశీ వగైరా పుణ్యక్షేత్రాలను దర్శించారు. నేపాల్‌లోని ముక్తినాథ్ కూడా దర్శించుకున్నారు. భర్తకు కూడా తీర్థయాత్రల పట్ల ఆసక్తి ఉందని, అవకాశం కలిగినప్పుడు ఇద్దరూ కలసి పుణ్యక్షేత్రాలు, తీర్థాలు చూస్తామని అనుపమ అన్నారు. కైలాస పర్వతం పరిక్రమ కూడా చేసినట్లు తెలిపారు.

డాక్టర్‌గా అనుభవాలు..

గైనకాలజిస్ట్‌గా ఎంతో అనుభవం కలిగిన డాక్టర్ అనుపమ ఎన్నో అనుభూతులున్నాయన్నారు. కాన్పుజరిగిన తరవాఅత ఎందరో మహిళలు తమ బిడ్డలతో పలుమార్లు తనను చూసేందుకు వస్తుంటారని, అంతేకాకుండా వారు తమ బంధువులను, స్నేహితులను కూడా తన వద్దకు పంపుతారని, తనపై వారికి అంత విశ్వాసమని సంతోషంగా తెలిపారు తేలికగా సుఖప్రసవాలు చేయడం, విజయవంతంగా శస్త్రచికిత్స చేయడం, గర్భ సంబంధిత రుగ్మతలకు చికిత్స చేయడం తన వృత్తిలో భాగాలని ఆమె తెలిపారు.

"మహిళలు తమ ఆరోగ్యం పట్ల తప్పకుండా శ్రద్ధ వహించాలి. వారు క్షేమంగా ఉంటేనే కుటుంబం ఆనందంగా ఉంటుంది. కుటుంబ ఆరోగ్యం ముఖ్యంగా భావించే గృహిణి, తన ఆరోగ్యం కూడా ముఖ్యమే అని ఎంచాలి. పౌష్టికాహారం పట్ల ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలి. ఆరోగ్యమే మహాభాగ్యమని గ్రహిస్తే భవిష్యత్తులో రుగ్మతల బారిని పడకుండా జాగ్రత్త వహించవచ్చు". అని డాక్టర్ అనూరాధ తరుణితో తన అనుభవాలు పంచుకున్నారు.


గర్భిణులకు సలహాలిస్తూ...


పుస్తకావిష్కరణలో అతిథులు, నిర్వాహకులు

వీఐటీలో భారతిదాసన్ ఇయక్కం 36వ వార్షికోత్సవం

వేలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి వీఐటీ యూనివర్సిటీలో శుక్రవారం భారతిదాసన్ ఇయక్కం 36వ వార్షికోత్సవం జరిగింది. కార్యక్రమానికి వర్సిటీ చాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షత వహించగా, వర్శిటీ ఉపాధ్యాక్షుడు శంకర్, విద్యార్థినీ, విద్యార్థులు, లెక్చరర్లు పాల్గొన్నారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా తంజై తమిళ యూనివర్సిటీ వీసీ సుందరమూర్తి పాల్గొని, విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమిళంలో మాత్రమే తమిళఅరసి, తమిళ్‌సెల్వాన్ తదితర పేర్లున్నాయని, ఇలాగ భాషతో కలిగిన పేర్లు మరే భాషలోను లేవన్నారు. కార్యక్రమంలో భాగంగా 'నేర్మై' అను పుస్తకాన్ని ముఖ్యఅతిథి ఆవిష్కరించారు.

నరువిలో పేద పిల్లలకు ఉచిత గుండె చికిత్సలు


మీడియా సమావేశంలో నరువి ఆస్పత్రి డైరెక్టర్ జీవీ సంపత్, నిర్వాహకులు

వేలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరువి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో పదిమంది నిరుపేద కుటుంబాల పిల్లలకు గుండె సంబంధిత చికిత్సలు ఉచితంగా అందించనున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ జీవీ సంపత్ తెలిపారు. ఆస్పత్రి ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నరువి ఆస్పత్రి, అడయార్ ఆనంద్ భవన్ సంయుక్తంగా ఈ ఉచిత చికిత్సలు అందించనున్నామన్నారు. 5 నుంచి 15 ఏళ్లలోపుండి పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు గుండె సంబంధిత చికిత్స, ఆపరేషన్ తదితర ఖర్చులను అడయార్ ఆనంద్ భవన్ భరిస్తుందని తెలిపారు. వేలూరు, రాణిపేట, తిరుపత్తూర్, తిరువణ్ణామలై జిల్లాలకు చెందిన దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన పిల్లలకు గుండె చికిత్సా నిపుణులు డా.వి నాయకశుక్లా నేతృత్వంలోని బృందం చికిత్సఅందిస్తుందని తెలిపారు. అవసరమైన వారు ఆసుపత్రి హార్ట్ విభాగం ఆర్గనైజర్ పాల్‌సెల్వంను 8754047796 అనే నెంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఉపాధ్యక్షులు అనిత సంపత్, మేనేజింగ్ డైరెక్టర్ డా.పాల్‌హెన్రీ, జనరల్ మేనేజర్ నితిన్ సంపత్, అభిరామి నితిన్ తదితరులు పాల్గొన్నారు.



రంగు రంగుల విద్యుద్దీప కాంతులతో తిరుపతిలోని గోవింద రాజస్వామి ఆలయ రాజగోపురం శుక్రవారం రాత్రి మెరిసిపోయింది. దీపావళి వేడుకల్లో భాగంగా ఆలయంలో ఈనెల 30, 31 తేదీల్లో విశేష పూజలు, దీపావళి ఆస్థానం నిర్వహించనున్నారు.
ఈ నేపథ్యంలో విద్యుద్దీపాలతో ఆలయాన్ని, గోపురాలను టీటీడీ అలంకరించింది. రీవిగా నింగిలోకి చూస్తున్నట్లుగా ఉండే ఈ గోపురం.. రంగురంగుల కాంతులతో మెరిసిపోతూ నగరవాసులను, యాత్రికులను ఆకట్టుకుంటోంది.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

చల్లని గాలులు.. ప్రకృతి సోయగాల నడుమ పచ్చటి పొలాల్లో పక్షులు కిలకిలరావాలతో సందడి చేస్తున్నాయి. తీర ప్రాంత గ్రామమైన దామరాయి వద్ద వరిపైరుకు నష్టం కలిగించే కీటకాలను తింటూ.. చక్కర్లు కొడుతున్నాయి. ఈ సీజనైతే చాలు.. రైతన్నలకు నేస్తాలుగా ఈ పక్షులు పంట పొలాలపై ఎగురుతూ, అటు వెళ్లేవారికి కనువిందు చేస్తుంటాయి.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి




ఆనంద నిలయం కథ

ప్రత్యేక కథనం తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమల అనగానే వెలుగులీనే బంగారు గోపురం గుర్తొస్తుంది. దీనిని 'ఆనంద నిలయ విమానం' అంటారు. బంగారు తాపడపు కవచాలలో ఒదిగిన ఈ గోపురాన్ని ఎప్పుడు నిర్మించారనే ఆధారాల్లో స్పష్టత లేదు కానీ, బంగారు తాపడపు పనులు ఎప్పుడెప్పుడు జరిగాయో శాసన లిఖితమై ఉంది. 12, 13 శతాబ్దాల కాలంలో తిరుమల ఆలయ నిర్మాణ సమయంలో ఈ గోపురానికి 'విమానం' అనే మాట తొలిసారి వినిపించింది అంటారు. ఈ మూడంతస్తుల గోపురంలో దిగువన ఉండే రెండంతస్తులు దీర్ఘచతురస్రాకారంలో ఉంటాయి. చివరి అంతస్థు వర్తులాకారంగా ఉంటుంది. వేసర శైలిలో నిర్మించిన ఈ గోపురం మీద అసంఖ్యాక శిల్పాలుంటాయి. తొలి అంతస్తులో మాత్రం లతలు, మకరతోరణాలు మాత్రమే ఉంటాయి. రెండో అంతస్తులో వివిధ భంగిమల్లో 40 శిల్పాలుంటాయి. ఈ అంతస్తులోనే వాయవ్యంలో విమాన వేంకటేశ్వరుడి ప్రతిమ ఉంటుంది. మూడో అంతస్తులో మహాపద్మంతో పాటు 20 ప్రతిమలు ఉంటాయి. నాలుగు మూలల్లో 8 సింహాలుంటాయి. చిలకలు, లతలు, హంసలతో ఈ వర్తులాకారపు శిఖరగోపురం ఆకర్షణీయంగా ఉంటుంది.

భూతలం నుండి బంగారు కలశం దాకా ఆనందనిలయ విమానం ఎత్తు 65 అడుగుల 2 అంగుళాలు.





హైదరాబాదు మ్యూజియంలో ఉన్న తిరుమల ఆలయ సముదాయాల పాతచిత్రం

ఆనందనిలయం బొమ్మతో 2002లో తపాలాశాఖ ప్రత్యేక స్టాంపును కూడా విడుదల చేసింది.

- క్రీ.శ.839లో పల్లవరాజు విజయదంతి విక్రమవర్మ ఆనంద నిలయ విమానానికి స్వర్ణకవచం ఏర్పరచాడు.
- క్రీ.శ.1262లో జాతవర్మ సుందరపాండ్య దేవుడు కూడా స్వర్ణ కవచాన్ని సమర్పించాడు.
- క్రీ.శ.1359 జూలై 6న సాళువ మంగిదేవ మహారాజు ఆనంద నిలయ విమానంపై వున్న పాత కలశాన్ని తీసివేసి కొత్త బంగారు కలశాన్ని ప్రతిష్ఠించాడు.
- క్రీ.శ.1417లో విజయనగర అమాత్యుడు చంద్రగిరి మల్లన ఆనంద నిలయ విమాన జీర్ణోద్ధరణ చేశాడు.
- క్రీ.శ.1518 సెప్టెంబర్ 9న విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు 30 వేల బంగారు వరహాలతో ఆనంద నిలయ విమానానికి బంగారు మలాము చేయించాడు. ఆ తర్వాత వీరనరసింగదేవ యాదవరాయలు కూడా తన ఎత్తు బంగారాన్ని తులాభారం వేసుకుని, ఆ బంగారంతో ఆనందనిలయ విమానంతో పాటు బంగారు వాకిళ్లకు కూడా బంగారు పూత పూయించాడు.
- క్రీ.శ.1630లో కంచికి చెందిన కోటి కన్యాదానం తాతాచార్యులు ఆనందనిలయ విమానానికి బంగారు మలాము చేయించాడు.
- క్రీ.శ.1908 సెప్టెంబర్ 30న మహంతు ప్రయాగదాసుకు సోదర శిష్యుడైన అధికారి రామలక్ష్మణదాసు ఆనందనిలయ విమానంపై బంగారు కలశాన్ని ప్రతిష్ఠించాడు.
- 1958 ఆగస్టు 18 నుండి 27 వరకు పదిరోజులపాటు ఆనందనిలయ విమాన మహాసంప్రోక్షణ జరిగింది. ఆనందనిలయం మరమ్మతులు జరిగాయి. చెలికాని అన్నారావు సారథ్యంలో జరిగిన ఈ పనులకు 12 వేల తులాల బంగారం వాడారు.
- 1964లో అష్టబంధన మహాసంప్రోక్షణం జరిపారు.

పార్టీ ఎంతో ఇచ్చింది..
కొంతైనా తిరిగిచ్చేద్దాం

● డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి పిలుపు



వర్క్‌షాపులో పాల్గొన్న నటి నమిత, పొంగులేటి సుధాకర్ రెడ్డి తదితరులు

అడయార్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పార్టీ మనకు ఎంతో చేసిందనీ, పార్టీకి కొంతైనా తిరిగి ఇచ్చేద్దామని పార్టీ నేతలకు, శ్రేణులకు భారతీయ జనతా పార్టీ తమిళనాడు, కర్ణాటక జాతీయ కో-ఇన్‌చార్జ్ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. అంజికరైలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం 'తమిళనాడు బీజేపీ సంఘటన్ పర్వ్' పేరుతో ఒక వర్క్‌షాపు నిర్వహించారు. ఆ పార్టీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు, టీఎన్‌బీజేపీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ హెచ్.రాజా ఈ వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. ఇందులో డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి, బీజేపీ జాతీయ కార్యదర్శి అర్వింద్ మీనన్, తమిళనాడు సీనియర్ నేతలు డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్, కేశవ వినాయకన్, ఎం.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే, పార్టీ బలోపేతం కోసం సినీ నటి నమిత, పార్టీ నేతలు సెంథిల్, హంసవర్ధన్‌లకు క్రియాశీలక సభ్యత్వ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పొంగులేటి మాట్లాడుతూ, ప్రతి కార్యకర్తకు పార్టీ ఎంతో ఇచ్చిందని, ఇపుడు మనం క్రియాశీలక సభ్యత్వం పెంచడం ద్వారా పార్టీకి ఎంతోకొంత ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పార్టీలో గ్రూపు రాజకీయాలకు, ముఠా తగాదాలకు తావు లేదని, పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

సీఎం, డిప్యూటీ సీఎంలది
జాత్యాహంకార భావాలు

● వారిపై చర్యలకు అనుమతించండి ● గవర్నర్‌కు బీజేపీ వినతి

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జాత్యహంకార భావాలను వ్యాపింపజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్‌కు అనుమతించాలని గవర్నర్ ఆర్ఎన్ రవికి రాష్ట్ర బీజేపీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అశ్వత్థామన్ రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిప్రతం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇటీవల గవర్నర్ పాల్గొన్న హిందీ మాసోత్సవంలో తమిళతల్లి ప్రార్థనలో ఓ వాక్యం పాడకపోవడాన్ని తీరని నేరంలా విమర్శలు చేసిన ముఖ్యమంత్రి స్టాలిన్ గవర్నర్ జాత్యహంకారంతో ప్రవర్తిస్తున్నారంటూ ఆరోపించారని, తాను స్వచ్ఛమైన క్రైస్తవుడినని ప్రకటించుకున్న ఉదయనిధి సనాతన ధర్మాన్ని కూకటివేళ్లతో పెకలిస్తామని అదే పనిగా ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఇలా ఇద్దరూ కలిసి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేస్తుండటంతో బీఎన్ఎస్ చట్టం 218 ప్రకారం క్రిమినల్ చర్యలు చేపట్టేందుకు అనుమతించాలని గవర్నర్‌ను కోరినట్లు చెప్పారు.



గవర్నర్ ఆర్ఎన్ రవికి వినతి పత్రం సమర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి అశ్వత్థామన్

చెత్తపై నిరంతర పర్యవేక్షణ

● వెయ్యి ప్రాంతాల్లో ఏఐ కెమెరాలు



పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై సుందరీకరించేలా బహిరంగ ప్రాంతాల్లో నిబంధనలు అతిక్రమించి చెత్త వేయడాన్ని అడ్డుకొనేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటుకానున్నాయి. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కుమర గురుబరన్, చెత్తరహిత కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు పలు చర్యలు చేపట్టారు. బహిరంగ ప్రాంతాల్లో చెత్తవేసే వారికి విధిస్తున్న జరిమానా రూ.5,000 పెంచారు. అందుకోసం మండలాలవారీగా పర్యవేక్షణ బృందాలను ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో, బహిరంగ ప్రాంతాల్లో చెత్తవేసే వారిని పర్యవేక్షించాలా, చెత్త తొట్టెలు నిండడాన్ని గమనించేలా 'ఇంటెలిజెన్స్' అనే ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో కెమెరాలు ఏర్పాటుచేశారు. జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌కు ఈ కెమెరాలను అనుసంధానం చేశారు. ఈ విషయమై జీసీసీ కమిషనర్ కుమరగురుమరన్ మాట్లాడుతూ.. ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో తొలివిడతగా వెయ్యి ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు కానున్నాయి. ఈ కెమెరాల ద్వారా చెత్త తొట్టెలు నిండిన సమయంలో, ఆ తొట్టెతో కూడిన ఫొటో తీసి కంట్రోల్ రూమ్‌కు పంపిన వెంటనే 'అలారం' మోగుతుందని తెలిపారు. అనంతరం, మండల అధికారి, వార్డు డిప్యూటీ ఇంజనీర్, పారిశుధ్య అధికారులకు సమాచారం పంపి, ఆ తొట్టెల్లోని చెత్తను సత్వరం తొలగించేలా చర్యలు చేపట్టామన్నారు. సంబంధిత తొట్టె నుంచి చెత్త తొలగించే వరకు అలారం మోగుతుంటుందన్నారు. అలాగే, బహిరంగ ప్రాంతాల్లో చెత్తవేసే వారిని గుర్తించి స్పాట్ ఫైన్ వసూలుచేసేలా చర్యలు చేపట్టామని తెలిపారు. అందుకోసం సమగ్ర ప్రణాళిక తయారుచేసే పను లు చేపట్టినట్లు, త్వరలో టెండర్లు ఆహ్వానించి మూడు నెలల్లో ఈ విధానం అమలుకు వస్తుందని కమిషన్ తెలిపారు.

టీవీకే మహానాడుకు సర్వంసిద్ధం

● 101 అడుగుల స్తంభంపై పతాకావిష్కరణ ● రెండు లక్షల మంది వస్తారని అంచనా

అడయార్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అగ్రహీరో విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగం (టీవీఏ) తొలి మహానాడుకు సర్వంసిద్ధమయ్యాయి. మహానాడు ప్రారంభోత్సవానికి ముందు పార్టీ అధినేత విజయ్ 101 అడుగుల స్తంభానికి పార్టీ జెండా ఆవిష్కరించనున్నారు. ఈ మహానాడు ప్రాంగణంలో అనేక మహనీయుల కటౌట్లను ఏర్పాటు చేశారు. ఇందులో ఇద్దరు మహిళా స్వాతంత్ర్య సమరయోధులకు కూడా స్థానం కల్పించారు. అలాగే, మహానాడుకు రెండు లక్షల మంది టీవీకే కార్యకర్తలు, విజయ్ అభిమానులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ నెల 27న జరిగే మహానాడు కోసం 170 అడుగుల పొడవు, 65 అడుగుల వెడల్పుతో వేదిక నిర్మించారు. 85 ఎకరాల విస్తీర్ణంలో మహానాడు కోసం ఏర్పాట్లు చేశారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాన్ని సిద్ధం చేశారు. మహానాడుకు వచ్చే కార్యకర్తలు కూర్చునేందుకు 55 వేల కుర్చీలను వేస్తున్నారు. అయితే, ఈ మహానాడుకు రెండు లక్షల మంది వస్తారని టీవీకే పార్టీ నేతలు, మహానాడు నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. మహానాడు ప్రాంగంలో 60 అడుగుల ఎత్తులో కామరాజర్, అంబేద్కర్, పెరియార్‌తో పాటు పార్టీ అధ్యక్షుడు విజయ్ కటౌట్లను మొదట ఏర్పాటుచేయగా, శుక్రవారం ఇద్దరు మహిళా స్వాతంత్ర్య సమరయోధులైన వీర తంగైవేలు నాచ్చియార్, అంజలై అమ్మాళ్ కటౌట్లను కూడా పెట్టారు. వీటితోపాటు చేర, చోళ, పాండ్య రాజుల చిత్రాలను కూడా ఉంచారు. 101 అడుగుల దిమ్మెలో ఎగురవేసే పార్టీ పతాకం పదేళ్లపాటు ఎగురుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ జెండాను 20 అడుగుల వెడల్పు, 30 అడుగుల పొడవుతో తయారు చేశారు. మహానాడు జరిగే ప్రాంగణంలో 700 సీసీ కెమెరాలను అమర్చారు. మహానాడుకు వచ్చే కార్యకర్తల కోసం 300 మొబైల్ టాయిలెట్లను సిద్ధంగా ఉంచారు.



మహానాడు ప్రాంతంలో ఏర్పాటు చేసిన నేతల భారీ కటౌట్లు



కోయంబత్తూరులో కలకలం సృష్టిస్తున్న ఎంజీఆర్‌ని తలపించేలా విజయ్ పోస్టర్

ఐజీ పర్యవేక్షణలో భద్రత

మహానాడుకు నార్త్ జోన్ ఐజీ అస్రాకార్క్ సారథ్యంలో విల్లుపురం డీఐజీ దిశామిట్టల్ సహా ఇద్దరు డీఐజీలు, పది మంది ఎస్పీలు, 15 మంది ఏడీఎస్పీలు, 50 మంది డీఎస్పీలతో పాటు ఆరు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. తమ పార్టీ తొలి మహానాడు విజయవంతంగా నిర్వహిస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ విశ్వాసం వ్యక్తం చేశారు.

కొత్తపార్టీల జాబితాలో టీవీకే

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కొత్తగా నమోదుచేసిన రాజకీయ పార్టీల జాబితాలో 'తమిళగ వెట్రి కళగం (టీవీకే)' చోటుచేసుకుంది. సినీనటుడు విజయ్ ప్రారంభించిన టీవీకేను రాజకీయ పార్టీగా నమోదుచేయాలని ఫిబ్రవరి 2వ తేది కేంద్ర ఎన్నికల కమిషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తు పరిశీలించిన ఈసీ, టీవీకేను రాజకీయ పార్టీగా నమోదుచేసింది. ఈ నేపథ్యంలో, లోక్‌సభ ఎన్నికల అనంతరం కొత్తగా నమోదుచేసిన పార్టీల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం విడుదల చేసింది. ఈ జాబితాలో మొత్తం 39 పార్టీలుండగా, 26వ స్థానంలో టీవీకే పేరుంది. అలాగే, పార్టీ ప్రధాన కార్యాలయం 'ప్లాట్ నెం.275, కిషోర్ టౌన్, 8వ అవెన్యూ, పనయూర్, ఈస్ట్ కోస్ట్ రోడ్డు, చెన్నై-600119' అనే చిరునామాలో ఉన్నట్లు జాబితాలో పేర్కొన్నారు. కాగా, ఈనెల 27న పార్టీ తొలి మహాసభ జరుగనున్న నేపథ్యంలో, కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితాలో పేరుండడం ఆ పార్టీ కార్యకర్తలకు మరింత ఉత్సాహాన్ని అందజేసింది.